క్లుప్తంగా

కరాటేలో ఉచిత శిక్షణ



శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరడిమాంబ ఆలయం ఎదురుగా గల మైదానంలో గురువారం కరాటేలో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. కరాటే కోచ్ బూస సుకన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ తరగతుల్లో సుమారు 30 మంది స్థానిక చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని మెలకువలు నేర్చుకున్నారు. రన్నింగ్, ధ్యానం వంటి వాటిలో కూడా శిక్షణ ఇచ్చారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. సుకన్య మాట్లాడుతూ తనకు తెలిసిన విద్య పది మందికి పంచాలన్న ఆలోచనలో భాగంగా కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ఇక్కడికి వచ్చి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

మల్కాపురం: తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని, దాని వల్ల వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని కార్మిక సంఘ నాయకుడు బి.సత్యానందం అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గురువారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో చిన్నారులు పలు సినీ, జానపద గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో జ్ఞాపక శక్తి పెరిగేందుకు నిత్యం వారికి పాలు, గుడ్లు, తాజా ఆకుకూరలు, పండ్లు, కర్జూరం, పప్పు దినుసులు వంటి పోషక పదార్థాలు ఇవ్వాలని సూచించారు. డ్యాన్స్‌లతో ఆకట్టుకున్న చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లు



కిట్లు అందిస్తున్న డాక్టర్ మట్టా శశిప్రియాంక

కంచరపాలెం: ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పేరిట క్షయ వ్యాధి నివారణలో భాగంగా డీటీసీవో అండ్ డీఎంటీవో ఆదేశాల మేరకు గురువారం రామ్మూర్తిపంతులుపేట వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక చేతుల మీదుగా క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. మూడు సెంటర్లకు సంబంధించి 31 మంది రోగులకు పోషకాహార కిట్లు అందజేసినట్లు సెంటర్ టీబీ ప్రతినిధి ఎన్.పైడిరాజు తెలిపారు. టీబీ సిబ్బంది పూర్ణిమ, శరత్, రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మల్కాపురం: నైట్రోజన్ పైప్ తగిలిన ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన వై.సుశీల్‌యాదవ్(35) పరవాడలోని ప్రోక్షన్ ప్రొడక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి నైట్రోజన్ తరలించే లారీలో పని చేస్తున్నాడు. దీనిలో భాగంగా సోమవారం సంస్థ వద్ద లోడ్ చేసిన నైట్రోజన్ లారీతో హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ)కు వచ్చాడు. లారీలోని నైట్రోజన్‌ను అన్‌లోడ్ చేసేందుకు అవసరమైన పైప్‌ను హెచ్‌పీసీఎల్‌లో ఉన్న నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్ పైపునకు బిగించాడు. నైట్రోజన్ అన్‌లోడ్ అవుతుండగా సాంకేతిక సమస్య తలెత్తడంతో పైపు వేగంగా వచ్చి సుశీల్‌ను బలంగా ఢీకొంది. గాయపడిన ఆయనను అంబులెన్స్‌లో నగరంలోని మెడికవర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లోకి ప్లస్-2 అధ్యాపకులు

- గోపాలపట్నం జూనియర్ కళాశాలలో తీరిన లెక్చరర్ల సమస్య
- ఇంటర్ విద్యార్థినులకు ఊరట
- ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



గోపాలపట్నం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నూతనంగా చేరిన అధ్యాపకులు

గోపాలపట్నం: ఇంటర్మీడియట్ తరగతులు ఈ నెల 1 నుంచి మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్లస్-2 విద్యా బోధన మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అధ్యాపకుల నియామకాలు పూర్తి చేసింది. ఇంటర్‌లో అన్ని సబ్జెక్టులకు లెక్చరర్లను నియమించింది. ఈ మేరకు గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలో మూడు రోజుల కిందట అన్ని సబ్జెక్టులకు గాను ఏడుగురు అధ్యాపకులు విధుల్లోకి చేరారు. గురువారం నుంచి తరగతులు మొదలు కావడంతో వీరు పాఠాల బోధన ప్రారంభించారు. దీంతో ఈ కళాశాలలో అధ్యాపకుల సమస్యతీరినట్లయింది. తెలుగుకు సూర్యనారాయణ, ఇంగ్లిష్‌కు మల్లికార్జున, గణితంకు సత్యారావు, ఫిజిక్స్‌కు త్రినాథరావు, బోటనీకి జగ్గారావు, జువాలజీకి రాధారాణి, కెమిస్ట్రీ సబ్జెక్టు బోధనకు శివజ్యోతి విధుల్లో చేరారని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎస్తేర్ హెప్సిబా తెలిపారు. వారి రాకతో బోధనా సమస్యలు తొలగిపోయాయన్నారు. ఇంటర్‌లో మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తామని చెప్పారు. ఎటువంటి ఫీజులు లేకుండా ఇంటర్ విద్యాభ్యాసం చేయవచ్చని హెప్సిబా పేర్కొన్నారు. అన్ని రకాల వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆమె కోరారు.

ఇంటర్ ఖాళీ సీట్ల వివరాలు..

ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని హెచ్ఎం హెప్సిబా తెలిపారు. ఎంపీసీలో-40, బైపీసీ గ్రూప్‌లో- 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. బాలికలు మాత్రమే చేరేందుకు అవకాశముందని పేర్కొన్నారు. అధ్యాపకుల సమస్య తీరడంతో విద్యా బోధనలో మంచి మార్పు వచ్చిందన్నారు. ఈ నెల 14వ తేదీ లోపు ఆసక్తి గల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రవేశ ధ్రువపత్రాలు..

టెన్త్ పాసైన విద్యార్థినులు ఇంటర్‌లో చేరేందుకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ)తోపాటు విద్యార్థిని, ఆమె తల్లి ఆధార్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువ పత్రాలు, పదో తరగతి ఉత్తీర్ణత ధృవీకరణ పత్రం, పాఠశాలలో ఇచ్చిన దరఖాస్తును నింపి వాటిని జతచేసి అందించాలి. పూర్తి వివరాల కోసం పాఠశాలలోని కార్యాలయంలో సంప్రదించాలని సంబంధిత అధికారులు కోరారు.

సచివాలయాల్లో కార్పొరేటర్ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ గురువారం వార్డు పరిధిలోని పలు సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా గాంధీజీ వీధిలోని సచివాలయానికి వెళ్లి అడ్మిన్, ఇతర సిబ్బందితో మాట్లాడారు. ఏ సమస్యలపై ఎక్కువగా దర్‌ఖాస్తులు వస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు సమయానికి వస్తున్నారా లేదా.. విధుల్లో సక్రమంగా ఉంటున్నారా లేదా.. ప్రజలకు ఏ విధమైన సేవలు అందిస్తున్నారు తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం కార్పొరేటర్ మల్కాపురం, పల్లి వీధి, గొల్ల వీధి, జాలర వీధి తదితర ప్రాంతాల్లోని సచివాలయాలకు వెళ్లి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పార్టీ నాయకులు కొల్లి నూకరెడ్డి, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-5లో 89 శాతం పింఛన్ల పంపిణీ



జోన్-5 దయానందనగర్‌లో పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్, దాసరి శామ్యూల్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో గురువారం టీపీఆర్వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో వలంటీర్లు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చురుగ్గా చేపట్టినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జోన్ పరిధిలో 24 వార్డులకు సంబంధించి మొత్తం 26,154 మంది లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. సుమారు 89 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేసినట్లు టీపీఆర్వో ఏపీడీ కె.శైలజ తెలిపారు. ఆయా వార్డుల్లో వలంటీర్లు, వెల్ఫేర్ కార్యదర్శులు ఉదయం నుంచి పెన్షన్ పంపిణీలో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జెడ్సీ కృష్ణ ఆదేశించారు.

బాలల హక్కుల పరిరక్షణకు సహకరించండి

సచివాలయాల సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు

సీతమ్మధార: రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వాములై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం కోరారు. సీతమ్మధారలో గురువారం 14, 15, 16 వార్డుల సచివాలయాలకు చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి ఆఖరి వరకు రాష్ట్ర స్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు, శాఖల అధికారిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఈ తరుణంలో సచివాలయం సిబ్బంది పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి తిరిగి స్కూల్‌లో చేర్పించాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు తరచూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలలకు వైద్య పరీక్షలు, రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. దివ్యాంగ బాలలకు పెన్షన్ల జారీ, పాఠశాలల్లో చేర్పించేలా చర్యలకు యుద్ధప్రాతిపదికన ఆదేశాలు జారీ చేశారు. సమతుల్య పౌష్టికాహారాన్ని అందించే ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై డేగ కళ్లతో పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ కార్యదర్శులంతా విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ఇతర ధ్రువ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సచివాలయ ప్రతినిధులు బి.మహాలక్ష్మి, కె.వి.సాయిశ్రావణి, ఎస్.శిరీష, వి.వెంకటలక్ష్మి, వి.శ్యామల, వై.మంగ, బి.సతీష లావణ్య, హేమలత, ఆది, సోంబాబు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల విధుల బహిష్కరణ



ఎల్‌పీజీ ప్లాంట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మల్కాపురం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హెచ్‌పీ న్యూ ఎల్‌పీజీ ప్లాంట్(గ్యాస్ కంపెనీ) ఎదుట గురువారం లోడింగ్ అండ్ అన్ లోడింగ్ కార్మికులు విధులు బహిష్కరించారు. సంస్థ గేటు ముందు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వి.రమణ, జె.అప్పారావు మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా ఎల్‌పీజీ ప్లాంట్‌లో పలువురు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్మికులను గురువారం గేటు బయట ఉంచి, లోడింగ్ అయే లారీతో పాటు వచ్చి, మళ్లీ అదే లారీతో బయటకు వెళ్లాలని నోటీస్ ఇచ్చారన్నారు. దీంతో తామంతా గేటు బయట నిలిచిపోయామన్నారు. ప్రస్తుతం ఒక సిలిండర్‌ను లారీలో లోడ్ చేస్తే రూ.1.40 డీలర్ ఇస్తున్నారని, ఇది సరిపోవడం లేదని, సిలిండర్‌కు రూ.1.60 పైసలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలకు పది పైసలు చొప్పున పెంచుతామని యాజమాన్యం చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. సంస్థ యాజమాన్యం విజ్ఞప్తి మేరకు సెకండ్ షిఫ్ట్ నుంచి పనులు మొదలు పెట్టామన్నారు. సమస్యలపై డీలర్‌లు, యాజమాన్యం మధ్య చర్చ జరుగుతుందని, అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే విధులకు హాజరవుతామని, లేకుంటే శుక్రవారం నుంచి మళ్లీ ఆందోళన చేస్తామని యూనియన్ నాయకులు తెలిపారు.

వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలు

మర్రిపాలెం: వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలైన ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. ఈ మేరకు ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. యలమంచిలి ప్రాంతానికి చెందిన కసింకోట భవాని, తన కుమారుడు శశిభూషణ్‌తో కలిసి బుధవారం(గత నెల 31న) కంచరపాలెం కప్పరాడలోని తన బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం కప్పరాడ జంక్షన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి భవాని, శశిభూషణ్‌తో కలిసి రోడ్డు దాటుతున్న క్రమంలో ఊర్వశి జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తున్న ఏసర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో శశిభూషణ్‌కు గాయాలయ్యాయి. తల్లి ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్ధం కేసు దర్యాప్తు చేపట్టారు.

పెన్షన్ అందుకుంటూ మహిళ భావోద్వేగం



పింఛన్ ఇస్తున్న సమయంలో కార్పొరేటర్ సుధ ఎదుట కన్నీరు పెట్టుకుంటున్న రాజేశ్వరి

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో మంజూరు చేసిన పింఛన్ అందుకున్న ఓ మహిళ గురువారం భావోద్వేగానికి గురైంది. జీవీఎంసీ 61వ వార్డు గాంధీజీ వీధికి చెందిన గోకేటి రాజేశ్వరికి కుమారుడు ఉన్నాడు. ఆయన నగరంలో భార్య, పిల్లలతో ఉంటున్నాడు. దీంతో రాజేశ్వరి ఒంటరైపోయింది. ప్రభుత్వ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. సాంకేతిక సమస్యల కారణంగా మంజూరు కాలేదు. ఈ క్రమంలో ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గాంధీజీ వీధిలో పర్యటించిన ఆడారి ఆనంద్‌కుమార్ ఎదుట రాజేశ్వరి తన గోడు విన్నవించుకుంది. దీంతో స్పందించిన ఆయన ప్రభుత్వ పింఛన్ మంజూరయ్యేంత వరకు ప్రతి నెలా పింఛన్ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఒకటో తేదీ కావడంతో ఉదయం 6 గంటలకే ఆనంద్‌కుమార్ పంపించిన రూ.2,750 పింఛన్ సొమ్మును కార్పొరేటర్ కొణతాల సుధ చేతుల మీదుగా రాజేశ్వరి అందుకుంది. ఈ సమయంలో సొంత కొడుకులా ఆనంద్‌బాబు ఆదుకున్నారని ఆమె కన్నీరుపెట్టుకుంది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లి నూకరెడ్డి, బూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అశోక్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ఎల్.వి.నరేష్, ఆడారి హరీష్, తదితరులు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులతో కలిసి పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు సమస్యను వివరించామన్నారు. ఆనంద్ అధికారులతో మాట్లాడి ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు త్రినాథ్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

‘వైఎస్సార్ బీమా’తో పేదలకు భరోసా



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంతో భరోసా లభిస్తుందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం 2023-24 సంవత్సరానికి గాను ప్రజాసర్వే వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. 2022-23 సంవత్సరానికి వైఎస్సార్ బీమా ద్వారా రాష్ట్రంలో 1.22 లక్షల మంది లబ్ధి పొందారన్నారు. సాధారణ మరణాలకు 15.07.2023తో, ప్రమాదవశాత్తు మరణాలకు 30.06.2023తో ఈ పథకం పూర్తవుతుందని తెలిపారు. జూలై 1 నుంచి తిరిగి ఈ పథకం ప్రారంభమవుతుందన్నారు. ఈ బీమా కోసం వలంటీర్లు ఇంటికి వచ్చి నమోదు చేస్తారని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుబజార్ల అభివృద్ధికి కృషి



మర్రిపాలెం రైతుబజార్‌లో సమస్యలు పరిశీలిస్తున్న సీఈవో నందకిషోర్

గోపాలపట్నం: నగరంలోని అన్ని రైతుబజార్ల అభివృద్ధికి క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తున్నామని రాష్ట్ర రైతు బజార్ల ముఖ్య కార్యనిర్వాహక అధికారి(సీఈవో) ముల్లంగి నందకిషోర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం మర్రిపాలెం రైతుబజార్‌లో ఆయన పర్యటించి రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో రైతుబజార్ల ఈవో తెలిపిన సమస్యలపై ఆరాతీశారు. విద్యుత్ వైరింగ్, లైట్లు, రైతుబజార్ల వెనుక వైపు కాంపౌండ్ వాల్, బజారు ముఖద్వారం, మరుగుదొడ్ల నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం, ఫ్లోరింగ్ మరమ్మతులు, సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రైతుబజార్‌లో నెల కొన్న సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు, వినియోగదారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ వాణిజ్య అధికారి షేక్ యాసిన్, డీఈ కెనడీ, మర్రిపాలెం రైతుబజార్ ఈవో కె.వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం



త్రినాథపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా: జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ మలేరియా విభాగాల ఆధ్వర్యంలో గురువారం 62వ వార్డు త్రినాథపురంలో నిర్వహించిన మలేరియా నివారణ మాసోత్సవాలను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు బయాలజిస్ట్ చక్రవర్తి పర్యవేక్షణలో ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రతి వార్డులో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ఆధునిక టెక్నాలజీలతో కూడిన పరికరాలను అమర్చి ప్రజలకు అతి చేరువలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ప్రజలందరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలని సూచించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ నెల 30 వరకు మసోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా నివారణ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, రాజ్‌కుమార్, హెల్త్ సెక్రటరీ రమ్య, ఆశా కార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నివారణ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ జోన్-3 పరిధి 25వ వార్డు రెల్లి వీధిలో గురువారం మలేరియా మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సంయుక్తంగా సీతంపేటలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించాయి. ముఖ్య అతిథి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. కరోనా కష్టకాలంలో వైద్య, ఆరోగ్య, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది వెలకట్టలేని సేవలు అందించారని కొనియాడారు. మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా జీవీఎంసీ, మలేరియా సిబ్బందికి సహకరించాలని కోరారు.

నీటి నిల్వలు ఉంచొద్దు..

జిల్లా మలేరియా అధికారి వై.మణి, బయాలజిస్ట్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ నెల నుంచి అక్టోబరు వరకు నగరంలో మలేరియా జ్వరాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. జీవీఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, డీపీఎంవో డాక్టర్ రామిరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు మాట్లాడుతూ మలేరియాను వ్యాప్తి చేసే ఎనాఫిలస్ దోమలు నిల్వ ఉన్న మంచినీటిలో పెరుగుతాయన్నారు. వాటి నియంత్రణకు గోళాలు, కుండీలు, వోవర్‌హెడ్ ట్యాంకులపై మూతలు పెట్టాలని సూచించారు. దోమలు పెరిగే ప్రదేశాలు, మలేరియా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు, మలేరియా సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఏటీఆర్ ట్రస్ట్ పింఛన్ సాయం



రమణకు పింఛన్ అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న రమణకు ఆడారి తులసీరావు(ఏటీఆర్) ట్రస్ట్ ద్వారా రూ.2,750 పింఛన్‌ను గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కొంత మంది బాధితులకు ట్రస్ట్ ద్వారా పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. రమణ ఇటీవల ఒక కంటి చూపు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు పింఛన్ రూపంలో సాయమందిస్తున్నట్లు చెప్పారు. ఆడారి ఆనంద్‌కుమార్ తన ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో ఎంతో మందికి ఆర్థికంగా సాయపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నర్సింహనగర్‌లో జెడ్సీ పర్యటన



బంక్ జంక్షన్‌లో టీ దుకాణం వద్ద పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: గోపాలపట్నం పెట్రోల్ బంక్ సమీపంలోని నరసింహనగర్‌లో గురువారం ఉదయం జోనల్ కమిషనర్ మల్లయ నాయుడు పర్యటించారు. పలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు వీధుల్లో రహదారులపై వ్యర్థాలు వేసిన వారికి జరిమానా విధించాలని సచివాలయ కార్యదర్శులకు జెడ్సీ ఆదేశించారు. చెత్తను తడి, పొడిగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని స్థానికులకు సూచించారు. ప్లాస్టిక్ సంచులు వాడిన వారిపై కఠిన చర్యలు ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలని కోరారు. ప్లాస్టిక్ సంచులు అమ్మినా.. కొన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటనలో శానటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.